# జల్సాలకు బైక్ చోరీలు

- ఇద్దరు దొంగలు, మరో మైనర్ పట్టివేత
- 9 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎల్బీ నగర్ డీసీపీ సాయిశ్రీ



పట్టుబడిన దొంగలు, స్వాధీనం చేసుకున్న బైక్‌లతో డీసీపీ సాయిశ్రీ, ఏసీపీ భీంరెడ్డి, సీఐలు మన్మోహన్, వెంకటేశ్వర్లు

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 18 : చేసేది మెకానిక్ పని. కానీ రోజూ మద్యం తాగేవారు. తాగుడు, ఇతర చెడు అలవాట్లకు డబ్బులు సరిపోలేదు. ఇంకేముందు.. తాళాలు విరగ్గొట్టి బైక్‌లు నొక్కేద్దామని పథకం పన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి 9 బైక్‌లు, ఒక ఆటో దొంగతనం చేశారు. జల్సాల కోసం పక్కాగా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలు చివరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు చిక్కారు. బుధవారం వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి, సీఐలు మన్మోహన్‌యాదవ్, వెంకటేశ్వర్లుతో కలిసి ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన బండారి శివ వనస్థలిపురంలో బైక్ మెకానిక్ షాప్ నడిపిస్తున్నాడు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ మండలం కోటపహాడ్‌కు చెందిన మచ్చ రూపేశ్ వనస్థలిపురం సహారా ఎస్టేట్ సమీపంలో ఉంటూ కూలీ పని చేసే వాడు. రూపేశ్ రోజూ శివ మెకానిక్ షాప్ వద్దకు వెళ్లే వాడు. అక్కడ ఇద్దరు బాగా స్నేహితులయ్యారు. రూపేశ్ తన మైనర్ స్నేహితుడు, శివతో కలిసి రోజూ తాగేవారు. డబ్బులకు కష్టమయ్యేది. జల్సాల కోసం డబ్బు ఎక్కువ కావాలని అనుకున్నారు. బైక్ తాళాలు విరగ్గొట్టి దొంగతనాలు చేయాలని ప్లాన్ వేశారు. శివ మెకానిక్ కావడంతో వాహనాలపై పూర్తి పట్టు ఉన్నది. శివ, రూపేశ్ కలిసి తాళాలు విరగొట్టే పనిలో ఉంటే మరొకడు చుట్టూ జనాలను కనిపెట్టే వాడు. పార్కింగ్ ఏరియాలు లక్ష్యంగా చోరీలు చేసే వారు. అలా దొంగతనం చేసిన బైక్‌లను నాగోల్‌లోని మూసీ నది వద్ద పొదల్లో దాచేవారు. ఆపై ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు అమ్మేవారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి చైతన్యపురి, నాగోల్, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పార్కింగ్ ఏరియాలు, ప్రజలు తిరిగే ప్రాంతా ల్లో దొంగతనాలు చేశారు. రూపేశ్ హయత్‌నగర్ పీఎస్ పరిధిలో ఇటీవల జరిగిన ఓ భూ తగాదా విషయంలో జైలుకు కూడా వెళ్లివచ్చాడు.

**బైక్ తోసుకుంటూ వెళ్తూ పట్టుబడ్డారు**

అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలో పార్కు చేసిన బైక్ పోయిందని ఈ నెల 16న శ్రీరాం అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సీఐ మన్మోహన్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. మంగళవారం ఓఆర్‌ఆర్ పెద్దఅంబర్‌పేట వద్ద అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో శివ, రూపేశ్ దొంగతనం చేసిన ఓ పల్సర్ బైక్‌ను తోసుకుంటూ వెళ్లారు. అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేశారు. ఇద్దరిని గట్టిగా ప్రశ్నించడంతో అసలు విషయం బయటపడింది. విచారణ అనంతరం ఏ1 శివ, ఏ2 రూపేశ్‌ను అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్టు డీసీపీ సాయిశ్రీ వెల్లడించారు. దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న 9 బైక్‌లు, ఒక ఆటో విలువ రూ.10.40 లక్షలు ఉంటుందన్నారు. మైనర్‌ను జువెనైల్ కోర్టుకు తరలించినట్టు తెలిసింది. కేసు విచారణలో బాగా పనిచేసిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు. సమావేశంలో ఎస్సైలు కర్ణాకర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

**హాజరైన ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 18 : మండల కేంద్రంలో మూడు రోజుల నుంచి బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం జరిగిన నాభిశిల విగ్రహ యంత్ర ప్రతిష్ఠ మహోత్సవానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఎంపీపీ బుర్ర రేఖామహేందర్‌గౌడ్, సర్పంచ్ చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గణపతి పూజ, పుణ్య వచనం, శివపార్వతుల కల్యాణం తదితర ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నా రు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ నెల 19న వడి బియ్యాలు, బోనాల కార్యక్రమాలు ఉంటాయని పురోహితుడు జనమంచి సత్యనారాయణ శర్మ తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ రంగారెడ్డి జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ తాటిపల్లి సౌమ్యారమేశ్‌గౌడ్, ఉపసర్పంచ్ కావ్యాశంకర్‌గౌడ్, వార్డు సభ్యులు, నాయకులు చంద్రంగౌడ్, రాజలింగం గౌడ్, కిషన్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, చక్రవర్తిగౌడ్, ప్రవీణ్‌గౌడ్, రాజేశ్‌గౌడ్, జీవన్ కుమార్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, ముత్యాలుగౌడ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



బెగరి రాజు (ఫైల్)



శ్రీశైలం (ఫైల్)

శంకర్‌పల్లి, అక్టోబర్ 18 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేశ్ తెలిపిన వివరాలు.. శంకర్‌పల్లి మండలం జనవాడ గ్రామానికి చెందిన బెగరి రాజు (40), కురుమ శ్రీశైలం (32) ద్విచక్రవాహనంపై నగరానికి వెళ్తున్నారు. కొల్లూరు గేటు సమీపంలో ఇక్ఫాయ్ కళాశాలకు చెందిన విద్యార్థులు అతి వేగంగా కారు నడిపి బైక్‌ను ఢీకొట్టడంతో బెగరి రాజు అక్కడికక్కడే మృతి చెందారు. కురుమ శ్రీశైలాన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు కళాశాల ఎదుట బైఠాయించి బాధితులకు న్యాయం చేయాలని ధర్నా చేశారు. సీఐ నరేశ్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

**మరో ఘటనలో కండక్టర్ మృతి**

మోమిన్‌పేట : రోడ్డు ప్రమాదంలో కండక్టర్ మృతి చెందిన ఘటన మోమిన్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన పద్మ (40) హెచ్‌సీయూ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నది. తాండూరు నుంచి సదాశివపేట వెళ్లే సిమెంట్ లారీ మండల పరిధిలోని మేకవనంపల్లి వద్ద రోడ్డుపై బ్రేక్ డౌన్ అయింది. బుధవారం విధులకు వెళ్లేందుకు ఉదయం 4 గంటలకు పద్మ తన కుమారుడితో మోమిన్‌పేట నుంచి బైక్‌పై సదాశివపేటకు బయలుదేరారు. మేకవనంపల్లి వద్ద బ్రేక్‌డౌన్ అయిన లారీని వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. ఎస్సై విఠల్ రెడ్డి, సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

## గంజాయి పట్టివేత



గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఆమనగల్లు, అక్టోబర్ 18 : గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని ఆమనగల్లు పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. బుధవారం అందిన సమాచారం మేరకు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై బాల్‌రాం సిబ్బందితో కలిసి ఆమనగల్లు బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులో వస్తున్న బైరి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన నుంచి 12.531 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని కర్ణాటకకు తరలిస్తున్నట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు తెలిపారు.

**వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో**



12కిలోల గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

వికారాబాద్ : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో 12 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర తెలిపారు. ఎన్నికల విధుల్లో భాగంగా బుధవారం రైల్లేస్టేషన్‌లో తనిఖీ చేశామన్నారు. ఈ క్రమంలో 12 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో వికారాబాద్ ఎక్సైజ్ సీఐ రాఘవీణ, ఎక్సైజ్ ఎస్సై కోటేశ్వర్‌రావు, ఎస్సై వాణి, సిబ్బంది ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ వనజ

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 18 : గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించే వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వనజాశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హ్యాండ్ ఆఫ్ హోప్ స్వచ్ఛంద సంస్థ వారు ఆశ్రయం ఆధ్వర్యంలో బుధవారం చిన్నరావిరాల గ్రామ పంచాయతీలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పం చ్ ముఖ్యఅతిథిగా హాజరై ఎంపీటీసీ అనితామహేందర్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య పరీక్షల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామంలోనే ఉచిత వైద్య పరీక్షలు చేయడం సంతోషకరమన్నారు. రక్త, దంత, బీపీ, షుగర్, కంటి పరీక్షలు ని ర్వహించినట్లు వైద్యులు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కండ్ల అద్దాలు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శేఖర్‌రెడ్డి, వార్డు సభ్యుడు బాలరత్నం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, వైద్యులు వాసవి, జయంత్, మనోజ్ఞ, జేమ్స్‌అజత్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కొనసాగిన సర్వసభ్య సమావేశం

నవాబుపేట, అక్టోబర్ 18 : ఎన్నికల నియమ నిబంధనలను పాటిస్తూ బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కాలె భవాని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అయిపోగానే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఎన్నికల నియమావళి అడ్డు రావడంతో ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదన్నారు. పలు సమస్యలపై చర్చించామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, జడ్పీటీసీ జయమ్మ, తహసీల్దార్ జయరాం, ఎంపీడీవో సుమిత్రమ్మ, మండల వైద్యాధికారి రోహిత్, ఎంపీవో, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా తనిఖీలు



మొయినాబాద్ : గండిపేట చౌరస్తాలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు



పూడూరు : అంగడి చిట్టంపల్లి చెక్ పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న సీఐ వెంకటరామయ్య, ఎస్సై గిరి

మొయినాబాద్, అక్టోబర్ 18 : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు, ప్రత్యేక బృంద అధికారులు తనిఖీలను మమ్మరం చేశారు. మొయినాబాద్ మండల పరిధిలోని గండిపేట చౌరస్తాలో పోలీసులు చెక్ పోస్టు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. బుధవారం చేవెళ్ల నుంచి హైదరాబాద్ వెపు వెళ్తుండగా ఓ కారులో రూ.4లక్షల నగదును పట్టుకున్నారు. ఈ నగదును రెవెన్యూ అధికారులకు అప్పగించామని పోలీసులు తెలిపారు. వారు ఈ నగదును సీజ్ చేసి ఆర్డీవో కార్యాలయానికి తరలించారు.

**రూ.1.40లక్షలు పట్టివేత**

కొడంగల్ : ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో మమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై భరత్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కస్తూర్‌పల్లి చెక్‌పోస్టులో నిర్వహించిన వాహన తనిఖీల్లో ఒకరి నుంచి రూ.50 వేలకు పైగా, మరొకరి వద్ద రూ.90వేల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో నగదు తీసుకెళ్లాలంటే తప్పకుండా డబ్బుకు సంబంధించి పూర్తి వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని, లేనిపక్షంలో ఇబ్బందులకు గురి కావాల్సి ఉంటుందన్నారు.

**అంగడి చిట్టంపల్లిలో..**

పూడూరు : ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లు పరిగి సీఐ వెంకటరామయ్య పేర్కొన్నారు. బుధవారం పూడూరు మండలం హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి వికారాబాద్ జిల్లా సరిహద్దు అంగడి చిట్టంపల్లి చెక్‌పోస్టు వద్ద సీఐ ఆధ్వర్యంలో చన్గోముల్ ఎస్సై గిరి, సిబ్బందితో పలు వాహనాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి వద్ద రూ.50వేలకు మించి నగదు ఉంటే పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేస్తునట్లు తెలిపారు. ఆ డబ్బుకు సంబంధించిన పూర్తి వివరాలు, రశీదులు ఉండాలన్నారు. గ్రామాల్లోని బెల్టు షాపులో మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తునట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకొని పోలీసులకు సహకరించాలని సీఐ సూచించారు.